క్లుప్తంగా

టైలరింగ్ కేంద్రాన్ని సందర్శించిన డీపీఎం



బాన్సువాడ: బీర్కూర్ మండలం తిమ్మాపూర్, బరంగేడ్గిలో కొనసాగుతున్న టైలరింగ్ కేంద్రాలను బుధవారం డీపీఎం రమేష్ బాబు సందర్శించారు. విద్యార్థులకు త్వరగా యూనిఫాంలు అందేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తిమ్మాపూర్‌లో చేపల యూనిట్‌ను పరిశీలించారు. త్వరగా యూనిట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం గంగాధర్, సీసీఎస్, వీవోలు ఉన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అపరిచితులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని ఏఎస్సై రాములు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచిత వ్యక్తి కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే చెప్పకూడదన్నారు. పోలీస్ సిబ్బంది సాయి శివ, అంజి, సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

52వ సారి రక్తదానం




కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్త దాతల సమూహం ఉపాధ్యక్షుడు కిరణ్ బుధవారం 52వ సారి రక్తదానం చేశారు. కామారెడ్డికి చెందిన మనోజ్ఞ అనే మహిళకు అత్యవసరంగా ఓ నెగిటివ్ రక్తం అవసరం కావడంతో కిరణ్ రక్తదానం చేశారు. అరుదైన రక్తగ్రూప్ కలిగిన కిరణ్ మానవతా దృక్పథంతో అత్యవసరం ఉన్నవారికి ఓ నెగిటివ్ రక్తం ఇవ్వడంతో సమూహం వ్యవస్థాపకులు బాలు, అధ్యక్షుడు వేదప్రకాష్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ప్రతినిధులు జీవన్, వెంకటేష్, సంతోష్‌లు అభినందించారు.

గుండెపోటుతో సొసైటీ డైరెక్టర్ మృతి



బీబీపేట: గుండెపోటుతో ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ మృతి చెందిన ఘటన బుధవారం తుజాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన ఇటికెల రాజయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. బుధవారం ఆపరేషన్ చేసిన తర్వాత ఉన్నట్టుండి గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందాడని బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్లు సంతాపం వ్యక్తం చేశారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బంది, వినియోగదారులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం ఉండడంతో ప్రాణ హాని చేసే విష జీవులు చేరే అవకాశముందన్నారు. మొక్కలు ఏపుగా పెరిగినట్లయితే వైర్లు ఒకదానికి ఒకటి తగిలి షాట్‌సర్క్యూట్ అయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టే కాకుండా కార్యాలయం, టవర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించాలని వినియోగదారులు, సిబ్బంది కోరుతున్నారు.

నేడు శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు ఇతర మండలాల నుంచి భక్తులు తరలి రావాలని కోరారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్

- సేకరించిన చెత్తను ఎక్కడంటే అక్కడ పారబోస్తోన్న పంచాయతీ సిబ్బంది
- కవర్లలో ఉన్న పదార్థాలను కవర్లతో సహా తిని మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- స్వైర విహారం చేస్తోన్న పందులు



మూలన పడ్డ స్వచ్ఛ భారత్ రిక్షాలు



పిట్లంలోని కంపోస్ట్ షెడ్

పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించిన మొత్తం చెత్తను డంపింగ్ యార్డ్, కంపోస్ట్ షెడ్‌కు తరలించకుండా గ్రామ పంచాయితీ కార్మికులు పశువుల సంత వద్ద, నాగంపల్లి, నిజాంసాగర్ రహదారుల పక్కన, గ్రామ శివారులలో ఎక్కడ అంటే అక్కడ పారబోస్తున్నారు. ఆ చెత్తలో పందులు తిరుగుతు స్వైర విహారం చేస్తోన్నాయి. ప్లాస్టిక్ కవర్‌లలో ఉండే తినే పదార్థాలను ప్లాస్టిక్ కవర్లతో సహా తిని మేకలు, గొర్రెలు లాంటి మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని, నివాసాలకు సమీపంలో చెత్తను పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద ఎక్కువవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పలు కాలనీల్లోకి చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్ రాకపోవడంతో కాలనీ వాసులు చెత్తను రోడ్డుపై ఒక దగ్గర పారబోస్తున్నారు. ఆ చెత్తను గ్రామ పంచాయతీ వారు తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద ఎక్కువవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది స్వచ్ఛ భారత్ రిక్షాల సహాయంతో చెత్తను సేకరించాల్సి ఉండగా అలా చెయ్యకుండా రిక్షాలను గ్రామ పంచాయతీ వద్ద నిరుపయోగంగా మూలన పడేశారు. ప్రభుత్వం రూ.లక్షల నిధులు మంజూరు చేసి కంపోస్ట్ షెడ్లను నిర్మించారు. ఇంటింటికి తడి పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. గ్రామంలో సేకరించిన చెత్తను పనికి రాని చెత్తను డంపింగ్ యార్డ్‌కు, పనికి వచ్చే చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించి, తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేయాలని, తయారు చేసిన ఎరువును మొక్కలకు వేసి, మిగిలిన ఎరువును అమ్మగా వచ్చిన నిధులతో పంచాయతీ అభివృద్ధికి వాడుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పిట్లం పంచాయతీ పరిధిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్ట్ షెడ్‌ను నిరుపయోగంగా వదిలేశారు. నిర్మించిన కొంత కాలానికే కంపోస్ట్ షెడ్‌లో ఏదో నామ్ కే వాస్తే చెత్తను వేసి ఎరువు తయారు చేసినట్లు చేసి వదిలేశారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారబోయకుండా డంపింగ్ యార్డు లేదా కంపోస్ట్ షెడ్‌కు తరలించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇస్లాంపుర కాలనీలో రహదారి పక్కన పడేసిన చెత్తాచెదారం

‘సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి’



మాట్లాడుతున్న అర్చక సమాఖ్య నేతలు

ఎల్లారెడ్డి: ధూప దీప నైవేద్య పథకంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అర్చకులు సమిష్టిగా కలిసి రావాలని అర్చకుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరప్ప కోరారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని నీల కంఠేశ్వరాలయంలో ఐదు మండలాల ధూప దీప నైవేద్య పథక అర్చకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద పనిచేస్తున్న అర్చకులు తమ ఆలయాల రిజిస్ట్రేషన్ మళ్లీ చేయించుకోవాలని, ఆలయాలకు ఏదైన గుడి మాన్యం భూములు ఉంటే వాటి వివరాలు, ఆలయాల ఆదాయ వివరాలు తెలియజేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు కోరుతున్నారని అన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆలయాలకు మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకోవడమేమిటని పలువురు అర్చకులు అభ్యంతరం తెలిపారు. అదే విధంగా గ్రామాలలో ఆలయాలకు ఉన్న మాన్యం భూములు చాలా చోట్ల ఎప్పటి నుంచో అన్యాక్రాంతమయ్యాయని, వాటి వివరాలు కోరితే తాము ఎలా అందించగలమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడులకు ఉన్న మాన్యం భూముల వివరాలు ఆయా మండలాల తహసీల్ కార్యాలయాల నుంచి సేకరిస్తే బాగుంటుందని అన్నారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఇక నుంచి ప్రతి అమావాస్య చతుర్థి రోజున ఐదు మండలాల అర్చకుల సమావేశం జరగనుందని, దానికి ప్రతీ సంఘ సభ్యుడు తప్పనిసరిగా హాజరవ్వాలని జిల్లా కార్యదర్శి కోరారు. ఐదు మండలాల అర్చక సమాఖ్య అధ్యక్షుడు జంగం సిద్దేశ్వర్, ప్రధాన కార్యదర్శి శేఖరప్ప హాజరయ్యారు.

మురికి కాల్వల్లో పూడిక తొలగించండి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం గ్రామానికి చెందిన పలువురు యువకులు కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా యువకులు గ్రామంలోని వీధుల్లో మురికి కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తీయించాలని కోరారు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం డంపింగ్ యార్డుకు తరలించాలని కోరారు. మురికి కాల్వలు లేని చోట, కాల్వలు ధ్వంసమైన చోట కొత్తగా నిర్మించాలని కోరారు. ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడాలన్నారు. వీధుల్లో దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. యువకులు క్రాంతికుమార్, దిలీప్, రంజిత్, గణేశ్ పలువురు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



కామారెడ్డి అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఓం శాంతి కేంద్రాల నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ఇంచార్జి బీకే జయదీదీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఓం శాంతి కామారెడ్డి కేంద్రంలో మొక్కలు నాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయదీదీ పర్యావరణ పరిరక్షణ సందేశమిచ్చారు. రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా ప్రజలను పర్యావరణంపై చైతన్యం చేస్తున్నామన్నారు. బ్రహ్మకుమారీలు గంగా, సంతోషి, కవిత, స్వామి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



బాన్సువాడ: మొక్కలు నాటుతున్న జడ్జి భార్గవి



ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో.. జడ్జి హారిక



దోంగ్లీలో మొక్కలకు నీరు పోస్తున్న వైద్య సిబ్బంది



బిచ్కుందలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

బాన్సువాడ: బాన్సువాడ సివిల్ కోర్టు ఆవరణలో బుధవారం జడ్జి భార్గవి మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఆమె మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు ఖలీల్, రమాకాంత్, హమీద్, లక్ష్మారెడ్డి, మొగులయ్య, రాంరెడ్డి, సీఐలు సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో జడ్జి హారిక..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో జడ్జి హారిక బుధవారం మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీద్, ఏజీపీ శ్రీనివాస్, న్యాయవాదులు పండరి, సాయిప్రకాష్ దేశ్‌పాండే, సతీష్, గోపాల్‌రావు, శ్రీకాంత్, సాయిబాబా తదితరులున్నారు.

దోంగ్లీ పీహెచ్‌సీలో..

మద్నూర్(జుక్కల్): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దోంగ్లీ వైద్య సిబ్బంది పేర్కొన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలోని మొక్కలకు నీరు పోశారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంపీడీవో గోపాల్, ఎంపీవో మహబూబ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు మొక్కలు నాటారు. జీపీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వీటితో పాటు వణ్యప్రాణులను రక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ప్రతి జీపీ పరిధిలో 8 వేల మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



కామారెడ్డి టౌన్: జహీరాబాద్ పార్లమెంట్‌తో పాటు దేశంలో ఇండియా కూటమికి గణనీయ సంఖ్యలో సీట్లు సాధించడంతో జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు నాయకులు బుధవారం సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు అశోక్‌రెడ్డి, చాట్ల రాజేశ్వర్, అంజాద్, శ్రీనివాస్, సిరాజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌పై విద్యార్థులకు శిక్షణ



భిక్కనూరు: అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో భిక్కనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. అట్టముక్కలతో చేస్తున్న వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 12 వరకు శిక్షణ ఉంటుందని నిర్వాహకులు వాణి తెలిపారు.

సురేశ్ షెట్కార్‌కు సీఎం అభినందనలు



నిజాంసాగర్/కామారెడ్డిటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా విజయం సాధించిన సురేశ్ షెట్కార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తదితరులున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సొంతూరు సిర్పూర్‌లో కాంగ్రెస్‌కు 78 ఓట్ల మెజార్టీ తీసుకురావడం పట్ల జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును కూడా అభినందించారు.

రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారిణి భాగ్యలక్ష్మి

పిట్లం/పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్: ఫర్టిలైజర్ దుకాణాలలో విత్తనాల అమ్మకాలకు సంబంధించి రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి భాగ్యలక్ష్మి, దుకాణదారులకు సూచించారు. ఆమె గురువారం సిబ్బందితో కలిసి పిట్లం, పెద్దకొడప్‌గల్, మహమ్మద్‌నగర్ మండలాల పరిధిలోని పలు విత్తన దుకాణాలను పరిశీలించారు. తనిఖీలు చేశారు. విత్తనాల స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రైతు కొంటున్న విత్తనాలకు ఒరిజినల్ బిల్లులు తీసుకోవాలని, విత్తనం మొలకెత్తి పంట చేతికి వచ్చే వరకు ఒరిజినల్ బిల్లును దాచుకోవాలన్నారు. విత్తనం మొలకెత్తని సమయంలో బిల్లు తీసుకెళ్లి కన్స్యూమర్ కోర్టులో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖాధికారులు రికమెండ్ చేసిన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలని సూచించారు.

కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటాలి



కంభపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి

పిట్లం(జుక్కల్): కంభపూర్ గ్రామంలో సీఆర్‌డీ, ఎన్‌జీవో, ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో శివ మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు, నేల, నీరు, గాలి కాలుష్యాలను తగ్గించటానికి ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని, ప్లాస్టిక్, టైర్ లాంటి వస్తువులు కాల్చకూడదని సూచించారు. అనంతరం ఆయన సిబ్బంది, గ్రామస్తులతో కలిసి గ్రామ శివారులోని పెరుమల్ల కుంట వద్ద 50 మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. టీఏ తుకారాం, ఎఫ్ఏ కేశయ్య, సీఆర్‌డీ సంస్థ ప్రతినిధులు జైల్ సింగ్, శిల్ప, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం -1లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వాణి, పిల్లల తల్లులకు, గర్భిణులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే నష్టాలు, మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. జీపీ కార్యదర్శి రాజేష్, ఏఎన్ఎం వెంకట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



టికారాం తండాలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

మండల పరిషత్ కార్యాలయంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పర్యావరణాన్ని సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఎంపీడీవో సూర్యకాంత్ ప్రజలకు సూచించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలో టికారాం తండాలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీవో సుదర్శన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్డీవో చందర్ నాయక్

కామారెడ్డి రూరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్డీవో చందర్ నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి ప్రాంగణాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

- జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్



సురేశ్ షెట్కార్‌ను సన్మానిస్తున్న భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు



తాడ్వాయి కాంగ్రెస్ నేతలు



బిచ్కుంద నాయకులు

భిక్కనూరు/తాడ్వాయి/బిచ్కుంద/నిజాంసాగర్: ఎన్నికల సమయంలోనే రాజకీయం చేయాలి.. తర్వాత అభివృద్ధే ధ్యేయంగా పార్టీలకతీతంగా పనులు చేపడతానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. బుధవారం ఆయనను భిక్కనూరు, తాడ్వాయి, బిచ్కుంద, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ నేతలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల సమస్యలు తెలుసుకుని తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో పరిష్కరింపజేస్తానన్నారు. కేంద్రంలో అధికారంలో లేకున్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించానని ప్రజలందరి కష్టసుఖాలు తనకు తెలుసును అన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరింపజేస్తానన్నారు.